ప్రజాశక్తి
మంగళవారం 14 మార్చి 2023 5
అనంతపురం

పోలింగ్ సరళిపై అనంతపురం కలెక్టరేట్ నుంచి పోలింగ్ ప్రక్రియను వెబ్ క్యాస్టింగ్ ద్వారా పరిశీలిస్తున్న అనంతపురం కలెక్టర్ నాగలక్ష్మి, ఎన్నికల పరిశీలకులు పోలా భాస్కర, హరిజవహార్

పోలింగ్ శాతం - సత్యసాయి జిల్లా

సమయం	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
10గం॥	11.34	19.08
12గం॥	32.13	53.46
2గం॥	52.19	76.88
4గం॥	67.13	92.71

పోలింగ్ శాతం - అనంతపురం జిల్లా

సమయం	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
10గం॥	12.00	18.00
12గం॥	31.23	46.62
2గం॥	49.93	64.22
4గం॥	67.13	87.31

మండలిపోరు ప్రశాంతం

- ఓటేసేందుకు ఉత్సాహం
- తరలివచ్చిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు
- సాయంత్రం 6గం॥ల వరకు పోలింగ్
- ఒకే కేంద్రం ఏర్పాటుతో ఇబ్బందులు
- మౌలిక వసతుల కల్పన నామమాత్రం
- కొన్ని సెంటర్లలో నీరు లేక ఓటర్ల అవస్థలు

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండలి పోరు సోమవారం నాడు ప్రశాంతంగా ముగిసింది. చిన్నపాటి సమస్యలు మినహా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలింగ్ కొనసాగింది. రెండు జిల్లాల పరిధిలో ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం అయ్యింది. ఉదయం నుంచే ఓటు వేసేందుకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఆసక్తి చూపారు. ఓటేసేందుకు క్యూలైన్లలో బారులుదీరారు. వికలాంగులు, మహిళలు కూడా ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. బాలింతలు చిన్న పిల్లలను సైతం ఎత్తుకుని పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి ఓటు వేశారు. ప్రముఖులు వారి ప్రాంతాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకుండా పోలీసులు పట్టిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు జిల్లాల కలెక్టర్లతో పాటు జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పరిశీలించారు. మండల కేంద్రాల్లో ఒకే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఓటు వేసేందుకు గంటల కొద్దీ క్యూలైన్లో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండవేడిమిన తట్టుకోలేక కొందరు ఇళ్లకు వెళ్లిపోయారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి వసతిని నామమాత్రంగా ఏర్పాటు చేయడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరిగిన శాసనమండలి ఎన్నికలు ఉమ్మడి జిల్లాలో సజావుగా, ప్రశాంతంగానూ జరిగాయి. కొన్ని కేంద్రాల్లో స్వల్పంగా నిర్వహణ లోపాలు కొట్టుచ్చినట్టు కనిపించాయి. 1400 మంది ఓటర్లు ఉన్న చోట కూడా ఒకే పోలింగ్ కేంద్రమే కావడంతో అటువంటి చోట రద్దీ కనిపించింది. కొన్ని చోట్ల మాత్రం సాధారణ పోలింగే జరిగింది. తాడిపత్రిలో 146 పోలింగ్ బూత్‌లో వైసిపి ఏజెంటు ఓటర్లు జాబితా తీసుకెళ్లడంతో కొంత సేపు వివాదం చోటు చేసుకుంది. దీంతో పోలింగ్‌కు 15 నిమిషాలు అంతరాయం ఏర్పడింది. ఆతరువాత అధికారుల జొక్యంతో సద్దుమణిగింది. బెళుగుప్పలోనూ వైసిపి, టిడిపి నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసుల జోక్యంతో సమస్య సద్దుమణిగింది. ఒకటి, రెండు చోట్ల ఓట్ల గల్లంతు సమస్య కూడా వచ్చింది. హిందూపురంలో తేజారెడ్డి అనే వ్యక్తి పట్టభద్రుల నియోజకవర్గానికి ఓటు వేయడానికి విమానంలో హైదరాబాద్ నుంచి ఇక్కడికి విచ్చేశారు. అయితే జాబితాలో ఓటు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతపురం నగరంలోని కెఎస్ఆర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలోనూ ఇదే రకంగా చోటు చేసుకోవడం బిజెపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రజాప్రతినిదులు, రాజకీయ ప్రముఖులు కూడా క్యూలైన్లలో నిలబడి ఓట్లు వేశారు. అనంతపురం నగరంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరితోపాటు పలువురు ప్రముఖులందరూ ఓటు వేశారు. సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిలు క్యూలైన్‌లో నిల్చొని ఓటు వేశారు.

పట్టభద్రులకు 65.92 శాతం పోలింగ్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి మొత్తం కడప, అనంతపురం, కర్నూలు నియోజకవర్గం పరిధిలో 65.92 శాతం ఓట్లు పోలయ్యాయి. అనంతపురం జిల్లాలో 67.13 శాతం, సత్యసాయి జిల్లాలో 75.32 శాతం, కడప జిల్లాలో 60.89 శాతం, అన్నమయ్య జిల్లాలో 68.31 శాతం, కర్నూలు జిల్లాలో 59.37 శాతం, నంద్యాల జిల్లాలో 70.90 శాతం పోలింగ్ జరిగింది. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం పరిధిలో మొత్తం 89.38 శాతం పోలింగ్ జరిగింది. అనంతపురం జిల్లాలో 87.31 శాతం సత్యసాయి జిల్లాలో 92.71 శాతం, కడప జిల్లాలో 85.24 శాతం, అన్నమయ్య జిల్లాలో 93.36 శాతం, కర్నూలు జిల్లాలో 90.26 శాతం, నంద్యాల జిల్లాలో 93.63 శాతం పోలింగ్ నమోదు అయ్యింది.

గుంతకల్లులో పట్టభద్రుల ఓటు వేసిన వికలాంగుడు

ఓటు వేసేందుకు క్యూలైన్లో నిల్చున్న సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్

సత్యసాయి జిల్లాలో ఎన్నికలు ప్రశాంతం : కలెక్టర్

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగాయని కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో జిల్లాలో పట్టభద్రుల ఎన్నికల కోసం 54 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 32 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పోలింగ్ జరిగిందన్నారు. పోలింగ్ నిర్వహణలో జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది తీసుకున్న చర్యలు విజయవంతం అయ్యాయన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేశాయని చెప్పారు. కౌంటింగ్ కూడా కట్టుదిట్టమైన భద్రత నడుమ సజావుగా నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు 'అనంత'జెఎన్‌టియుకు బ్యాలెట్ బాక్సులు

పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం పరిధి మొత్తం ఆరు జిల్లాల్లో ఉండటంతో పోలింగ్ పూర్తయిన తరువాత సోమవారం రాత్రి బ్యాలెట్ బాక్సులను ఆయా జిల్లాల్లోని స్ట్రాంగ్ రూములకు చేరుస్తారు. వీటిని అక్కడి నుంచి మంగళవారం ఉదయం అనంతపురం నగరంలోని జెఎన్‌టియు కళాశాలలో ఓట్ల లెక్కింపు జరిగే కేంద్రానికి చేర్చనున్నారు. మంగళవారం ఉదయమే పోలింగ్‌కు సంబంధించిన స్క్రూటినీ సైతం మంగళవారం నాడు కలెక్టరు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.నాగలక్ష్మి సమక్షంలో జరుగనుంది.

మడకశిరలో పట్టభద్రుల ఓటు వేసేందుకు చంటిబిడ్డతో పోలింగ్ కేంద్రానికి వచ్చిన బాలింత

ఓటేయలేక వెనుదిరిగారు..

చెన్నేకొత్తపల్లిలో రద్దీ ఎక్కువ ఉండడంతో ఓటేయకుండా వెనుదిరుగుతున్న ఓటర్లు

చెన్నేకొత్తపల్లి: శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలానికి సంబంధించి చెన్నేకొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ 1400 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఒకటే పోలింగ్ కేంద్రం ఉండడంతో ఓటేసేందుకు గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండవేడమిన తట్టుకోలేక చాలా మంది ఓటు వేయకుండానే వెనుదిరిగారు. అధికారులు ఓటు వేయాలని విజ్ఞప్తి చేసినా చాలా మంది అక్కడ పరిస్థితిని తట్టుకోలేక ఇళ్లకు వెళ్లిపోయారు.

వైసిపి రుబాబు..

గుంతకల్లులో పిడిఎఫ్ ఏజెంట్‌పై రుబాబు చేస్తున్న వైసిపి నాయకులు

గుంతకల్లు : గుంతకల్లు 160వ పోలింగ్ బూత్‌లో వైసిపి నాయకులు పిడిఎఫ్ ఏజెంట్‌పై రుబాబు చేశారు. ఓటరు జాబితాలో ఫొటో లేకుండా ఓటు వేసేందుకు వచ్చిన ఓటరు వివరాలపై పిడిఎఫ్ ఏజెంట్ అభ్యంతరం తెలిపారు. దీనికి వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏజెంట్‌ను దూషించారు. ఏజెంట్‌గా ఉనన వ్యక్తిని ఏకంగా అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ ప్రతాపం చూపారు. అక్కడే ఉన్న అధికారులు కలుగజేసుకుని ఇద్దరికి సర్ధిచెప్పారు.

నువ్వు ఓటరా..

లుంగీతో వచ్చిన వ్యక్తి ఓటు ధ్రువీకరణ పత్రాలు చూస్తున్న ఎస్ఐ

మడకశిర : మడకశిర మండలం కంఠీపురం గ్రామానికి చెందిన తిప్పేస్వామి ఓటు హక్కు వినియోగించుకునేందుకు మడకశిర పట్టణంలోని పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. స్వతహాగా రైతు అయన లుంగీ, చొక్కాతో పోలింగ్ కేంద్రం క్యూలైన్‌లో నిల్చున్నాడు. ఈయన పట్టభద్రుడు కాడేమో అన్న అనుమానంతో ఎస్ఐ నాగేంద్ర ఆయన్ను పక్కకు పిలిచి వివరాలు అడిగాడు. తిప్పేస్వామి పట్టభద్రునిగా అన్ని పత్రాలు ఉండడంతో పోలీసులు ఖంగుతిన్నారు. పట్టభద్రుడు అయ్యి ఉండి రైతుగా ఆయన ఓటేసేందుకు వచ్చిన తీరుపై అక్కడున్న వారు అభినందించారు.

కమనీయం ఖాద్రీశుని రథోత్సవం

◆ జనంతో కిక్కిరిసిన కదిరి మాడావీధులు ◆ రథంపై దర్శనమిచ్చిన శ్రీవారు

కదిరి మాడా వీధుల గుండా కొనసాగుతున్న నరసింహుని రథోత్సవం

కదిరి అర్బన్ : కదిరి ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాముఖ్యమైన బ్రహ్మరథోత్సవం సోమవారం నాడు కమనీయంగా జరిగింది. అశేష జనవాహిని నడుమ అంగరంగ వైభవంగా రథోత్సవం కొనసాగింది. భారతదేశంలోనే 3వ అతిపెద్ద తేరుగా చెప్పుకున ఈ రథోత్సవం కనులపండువగా సాగింది. ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన లక్షలాది మందితో కదిరి మాడావీధులు కిక్కిరిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు నిర్ణయించిన సమయానికి రథోత్సవం ప్రారంభం అయ్యింది. పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతి నిధులు, ఆలయ అర్చకులు ఆనవాయితీగా ప్రత్యేక చేయాల్సిన పూజలన్నింటినీ పూర్తి చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉదయాన్నే ప్రత్యేక పూజలు జరిపి మేళతాళాలతో ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్ధారెడ్డి పాలకమండలి ఛైర్మన్ గోపాలకష్ణ, ఆలయ ఈవో గురుప్రసాద్, ప్రముఖులు ఇందులో పాల్గొన్నారు. గోవింద, నారసింహస్వామి నామ స్మరణలతో తిరువీధులన్నీ మారుమోగాయి. స్వామివారికి ప్రీతి అయిన దవనం, మిర్యాల గుమ్మడికాయలు భక్తులు స్వామివారికి, భక్తులు మొక్కుబడులు చెల్లించారు. ఉత్సాహంగా భక్తులు మొకులు లాగి రథాన్ని యథాస్థానానికి చేర్చారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసుల భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం అన్నదాన కేంద్రాలు, మజ్జిగ, చల్లని పానీయాలు, మిఠాయిలను దాతలు పంపిణీ చేశారు.

రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా॥ పివి.సిద్ధారెడ్డి, ఆలయ ట్రస్టు సభ్యులు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు సోమవారం మండల పరిధిలోని మోపిడి, ఇంద్రావతి, పెద్ద ముష్టూర్ గ్రామాల్లో ఆర్డీటీ కమ్యూనిటీ ఆర్గనైజర్ తిమ్మరాజు, లక్ష్మీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి.షఫీ, ఆర్డీటీ సెక్టార్ టీం లీడర్ హుస్సేన్‌బీ మాట్లాడుతూ మహిళలకు, కిశోర బాలికలకు,మహిళా సాధికారత గురించి మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్నా సమస్యలు వాటిని ఎలా సమర్థవంతంగా ఎదుర్కోవాలో అనే అంశాలపై అవగాహనా కల్పించారు.ముఖ్యంగా ఆడపిల్లల అనేక సమస్యలకు మూలం నిరక్షరాస్యత అని అమ్మాయిలు చదువుకొంటేనే సాధికారత సాధించ వచ్చునని తెలిపారు.సమాజంలోఆడా,మగ వైవిద్యాలు ఎక్కువని మహిళల పట్ల చిన్నచూపు చూస్తున్నారని సరికాదని తెలిపారు.ఒంటరి మహిళలకు ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై ఆడవారిని వేధిస్తున్న వరకట్నం,బ్రున హత్యకు నివారణకు చట్టాలున్నాయని చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలని,బాల్యవివాహాలు జరగకుండా చూడాలని అప్పుడే నిజమైన మహిళా దినోత్సవం అని తెలిపారు. ఫోక్సో, దిశా చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రోర్ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు భగవాన్‌దాస్, తిమ్మరాజు, స్వాతి, సీడీసీ సభ్యుడు వెంకటప్ప, సీబీటీ శాంతి, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న వక్తలు

ఈకేవైసీ తప్పనిసరి

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లాలో 2022-23 జిల్లాలో రబీ పంట సాగుచేసిన రైతుల ఈ పంట నమోదు 97శాతంం పూర్తి చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వైవి సుబ్బారావు తెలిపారు. జిల్లాలో రబీ సీజన్లో 960,24 ఎకరాలలో పంట నమోదు చేశామన్నారు. అదేవిధంగా 2022 ఖరీఫ్ సీజన్లో 8.04 లక్షల ఎకరాల్లో పంట నమోదు పూర్తి కాగా జిల్లాలోని అన్ని గ్రామాల్లోని ఆర్‌బికెల వద్ద మార్చి 10వ తేదీన ఈ క్రాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించినట్లు చెపాపరు. సామాజిక తనిఖీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌బికెలలో ప్రదర్శిస్తున్న రబీ 2022- 23 సీజన్ కి సంబంధించి ఈ క్రాప్ ముసాయిదా జాబితాను ఈనెల 13వ తేదీ నుండి 17వ తేదీ వరకు సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా గ్రామ సభలు కూడా నిర్వహిస్తారని అందులో ఆర్‌బికె సిబ్బంది జాబితాలో ఉన్న రైతుల వివరాలు చదివి వినిపిస్తారని చెప్పారు. రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్ర పరిధిలో ఉన్న ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలుంటే రైతు భరోసా కేంద్రంలోని అధికారులను సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూమిపూజ

గోరంట్ల :మండలంలో కమ్మవారి పల్లి గ్రామ సమీపాన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సర్పంచి శివశంకర్ రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. కమ్మవారి పల్లి పంచాయతీలో విద్యుత్‌లో వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉండడంతో ప్రజల విన్నపం మేరకు ఎమ్మెల్యే శంకర్ నారాయణ స్పందించి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించడం పట్ల గ్రామస్తులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

97శాతం ఈ-క్రాప్ బుకింగ్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం డివిజన్ వ్యాప్తంగా 2022-23 రబీ సిజన్‌లో ఈ-క్రాప్‌ను 97 శాతం పూర్తి చేసి, ఆయా ఆర్‌బికెలలో జాబితాను సిద్దంగా ఉంచినట్లు ఎడి అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. హిందూపురం డివిజన్ వ్యాప్తంగా 2022-23 రబీ సీజన్‌లో 7467 మంది రైతులకు గాను 11042 ఎకరాలు ఈ క్రాప్ నమోదు చేసినట్లు చెపాపరు. రైతుల ఈ- కె.వై.సి 97 శాతం పూర్తిచేశామన్నారు. దీనిని డివిజన్‌లోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద మార్చి 10న యాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించామన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అర్ బి కె లలో ప్రదర్శిస్తున్న రబీ 2022-23 సీజన్‌కు సంబంధించి క్రాప్ ముసాయిదా జాబితా ఈ నెల 13 నుండి 17 వరకు ప్రదర్శించనున్నామని చెప్పారు. అనంతరం నిర్వహించే గ్రామసభల్లో అభ్యంతరాలు తెలియజేయాలన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

ప్రజాశక్తి-గుత్తి

పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి జరిగిన ఎన్నికలు గుత్తిలో ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి నాలుగు బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏపీ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 3304 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 2529 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కె.మధుసూదన్ తోపాటు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు ఓటు వేశారు. 76.54 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల పరిధిలో 289 మంది ఓటర్లు ఉండగా 270 మంది ఓటు వేశారు. 93.42 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు చెప్పారు. గుత్తిలోని ఎన్నికల ప్రక్రియను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య నాయకుడు సురేష్ తదితరులు పరిశీలించారు. గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్ప పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సిఐ ఎం. వెంకటరామిరెడ్డి, ఎస్ఐ ఆర్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుంతకల్లు : స్థానిక కసాపురం రోడ్డులోని డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఎంఆర్సీ ఎంపీడీవో కార్యాలయం, స్త్రీ శక్తి భవనంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్లు 5579 మంది ఉండగా 4210 (75.46 శాతం) మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయుల ఓట్లు 551 ఉండగా 509 (92.37 శాతం) మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తహశీల్దార్ బి.రాము తెలిపారు. ఎన్నికల పోలింగ్ సరళిని ఆర్డీవో కె.రవీంద్ర పరిశీలించారు. పోలింగ్ కేంద్రా వద్ద ఎలాంటి అల్లర్లు జరగకుండా కసాపురం ఎస్ఐ గోపాలుడు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు పోలింగ్ కేంద్రాల వద్దకు రాకుండా పోలీసులు నియంత్రించారు. జిల్లా ఎస్పీ పక్కీరప్ప పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

గుంతకల్లు రూరల్ : గుంతకల్లు పట్టణంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ బాయ్స్ హై స్కూల్‌లో నాలుగు పోలింగ్ కేంద్రాలు, ఎంపీడీవో కార్యాలయంలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పట్టాభద్రుల ఓట్లు 5703 ఉండగా 4210 ఓట్లు పోలయ్యాయి. 75.5 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 557 ఉపాధ్యాయ ఓట్లు ఉండగా 509 ఓట్లు పోలయాయ్యి. 92.3 శాతం మంది ఓటు హక్కును ఉపయోగించుకున్నట్లు ఆర్డీవో రవీంద్ర తెలియజేశారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని అధికారులను కోరారు.

తాడిపత్రి : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. తాడిపత్రి నియోజకవర్గంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ 75.72 శాతం, టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ 92.96 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. తాడిపత్రి మండలంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 5794 ఉండగా 4338 తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 74.87 శాతం పోలింగ్ నమోదయింది. ఉపాధ్యాయుల ఓట్లు 640 ఉండగా 594 ఓట్లు పోలయ్యాయి. 92.81 శాతం పోలింగ్ నమోదయింది. యాడికి మండలంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 1079 మంది ఉండగా 831 ఓట్లు పోలయ్యాయి. 77.06 శాతం పోలింగ్ నమోదయింది. ఉపాధ్యాయుల ఓట్లు 48 ఉండగా 44 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 91శాతం పోలింగ్ నమోదయింది. తాడిపత్రి నియోజకవర్గం గ్రాడ్యుయేట్ ఓటర్లు మొత్తం 8368 మంది ఉండగా 6337 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 75.72 శాతం పోలింగ్ నమోదయింది. ఉపాధ్యాయుల ఓట్లు 753 ఉండగా 700 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 92.96 శాతం పోలింగ్ నమోదయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

రాయదుర్గం : రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సోమవారం జరిగిన శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముసిగింది. 6137 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 4884 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 79.58 శాతం నమోదైంది. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు 345 మందికి 333 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 96.52 శాతం నమోదైంది. ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఉదయం నుంచే బారులుదీరారు. కాగా పోలింగ్ కేంద్రం వెలుపల టిడిపికి చెందిన టెంట్‌ను పోలీసులు తొలగించగా మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు వాగ్వివాదానికి దిగారు. తమ టెంట్‌తోపాటు వైసిపికి చెందిన టెంట్‌ను కూడా తొలగించాలని డిమాండ్ చేయడంతో ఎట్టకేలకూ తొలగించారు. తెలుగు యువత జిల్లా కార్యదర్శి మురళి పోలింగ్ కేంద్రంలో ఓటరుకు ఆధార్ గుర్తింపు కార్డు ఇచ్చేందుకు వెళ్తుండగా పోలీసులు అభ్యంతరం తెలిపారు. ఇకపోతే విప్ కాపు రామచంద్రారెడ్డి కుటుంబ సమేతంగా కేంద్రానికి వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు. తహశీల్దార్ మారుతి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాత, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మండల పరిషత్ అభివద్ధి అధికారి కొండయ్య, తదితరులు పోలింగ్ సరళిని పరిశీలించారు. సిఐ యుగంధర్, ఎస్ సుమన్ బందోబస్తును పర్యవేక్షించారు.

ఉరవకొండ : ఉరవకొండలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్లు 2081 ఉండగా 1548 మంది ఓటును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 187 మంది ఉండగా 173 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రులకు సంబంధించి సంబంధించి 74 శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు సంబంధించి 92 శాతం పోలింగ్ నమోదయినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను ఎస్పీ ఫక్కీరప్ప, గుంతకల్ ఆర్డీవో రవీంద్ర పరిశీలించారు.

విడపనకల్లు : మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్లు 715 మంది ఉండగా 595 మంది ఓటును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 16 మంది ఉండగా అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రులకు సంబంధించి సంబంధించి 83.21 శాతం, ఉపాధ్యాయులకు సంబంధించి 100 శాతం పోలింగ్ నమోదయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

బెలుగుప్ప : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్లు 751 మంది ఉండగా 603 ఓటు హక్కును వినియోగించుకున్నారు. 80 శాతం పోలింగ్ జరిగింది. 31 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా వంద శాతం పోలింగ్ నమోదయింది. సిఐ గణేష్, ఎస్ఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. తహశీల్దారు ఈశ్వరయ్య శెట్టి, జోనల్ అధికారి ఎల్లప్ప పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

పుట్లూరు : పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండల వ్యాప్తంగా పట్టభద్ర ఓటర్లు 835 మంది ఉండగా 650 ఓట్లు పోల్ అయ్యాయి. ఉపాధ్యాయ ఓటర్లు 18 మంది ఉండగా 17 ఓట్లు పోల్ అయ్యాయి. పట్టభద్రుల ఓటర్స్‌లో పురుషులు 490, మహిళలు 160 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు, ఉపాధ్యాయ ఓటర్లలో 13 మంది పురుషులు, నలుగురు మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటింగ్ ప్రక్రియను టిడిపి శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ పరిశీలించారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప సోమవారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌లోకి వెళ్లే మునుపు మహిళా ఓటర్లను ఫ్రిస్కింగ్ చేసేందుకు నియమించిన మహిళా పోలీసులతో ఆయన మాట్లాడి పలు సూచనలు చేశారు. ఓటర్ల గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఎస్పీ వెంట సిఐ మోహన్, ఎస్ఐ రంగుడు యాదవ్, పోలీసులు ఉన్నారు.

ఆత్మకూరు : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్లు 1070 మందికి ఉండగా 872 మంది తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. పురుషులు 604 మంది, మహిళలు 268 మంది ఓటు వేశారు. 81.49 శాతం ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయ ఓటర్లు 44 మంది గాను 38 మంది ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. 86.36 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సిఐ మోహన్, ఎస్ఐ రంగుడు యాదవ్ బందోబస్తు నిర్వహించారు.

శింగనమల : మండలంలో 78.90 శాతం పోలింగ్ నమోదయినట్లు అధికారులు వెల్లడించారు. శింగనమల మండల కేంద్రంలో పట్టభద్రుల ఓటర్లు 963 మంది ఉండగా 760 ఓట్లు నమోదు అయ్యాయి. ఉపాధ్యాయ ఓటర్లు 25 మంది ఉండగా 21 మంది ఓటు హక్కు ఉపయోగించుకున్నారు.

ఆత్మకూరులో క్యూలో ఉన్న ఓటర్ల స్లిప్పులు పరిశీలిస్తున్న ఎస్‌పి ఫక్కీరప్ప

డి.హీరేహాల్ : డి.హీరేహాల్ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేసేందుకు ఉదయం నుంచే ఓట్లు బారులు తీరారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు 601, ఉపాధ్యాయ ఓటర్లు 15 ఉండగా పోలింగ్ ముగిసే సమయానికి గ్రాడ్యుయేట్స్ 498 మంది, ఉపాధ్యాయులు 15 మంది ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. 84 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

నార్పల : నార్పల మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 1575 పట్టభద్రుల ఓటర్లకు గాను 1184 మంది ఓటు వేశారు. 75 శాతం పోలింగ్ జరిగింది. ఉపాధ్యాయుల్లో 56 మందికి గాను 54 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 98 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా సిఐ విజయభాస్కర్ గౌడ్, ఎస్ఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. తహశీల్దారు నారాయణస్వామి, ఎంపీడీవో దివాకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సందీప్, వీఆర్వోలు పోలింగ్‌ను పర్యవేక్షించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం ఒంటి గంట అయినా ఓటర్ల క్యూలైన్ ముందుకు కదలక పోవడంతో పలువురు ఓటు వేయకుండానే వెనుదిరిగారు. పోలింగ్ సమయాన్ని పెంచి అయినా ఓటర్లకు ఓటు హక్కును కల్పించాలని టిడిపి నాయకులు బండారు శ్రావణిశ్రీ అధికారులను కోరారు.

గార్లదిన్నె : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగిన పోలింగ్ అనంతరం పుంజుకుంది. మండలంలో 1409 పట్టభద్రుల ఓట్లకు గాను 1077 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 77 శాతం పోలింగ్ నమోదయింది. ఉపాధ్యాయ ఓటర్లు 43 మందికి గాను 39 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 90 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. తహశీల్దార్ ఉషారాణి, రెవెన్యూ సిబ్బంది ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.

పెద్దవడుగూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పట్టభద్రుల ఓటర్లు 904 మంది ఉండగా 698 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 77.21 శాతం పోలింగ్ నమోదు అయింది. ఉపాధ్యాయ ఓటర్లు 42 మంది ఉండగా అందరూ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వందశాతం పోలింగ్ నమోదైనట్లు తహశీల్దారు ఈరమ్మ తెలిపారు. ఎన్నికల సెక్టోరల్ అధికారి కృష్ణారావు పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఎస్ఐ రాజశేఖరరెడ్డి బందోబస్తు నిర్వహించారు.

గుమ్మఘట్ట : మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం సజావుగా సాగాయి. పట్టభద్రులు 656 మంది ఉండగా 563 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 85.82 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు 16 మంది ఉండగా 15 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 93 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్నంలోపే భారీగా ఓటర్లు తరలివచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ సునీత ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

శెట్టూరు : మండలంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలవ్యాప్తంగా 744 మంది పట్టభద్రులు ఉండగా 601 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. అలాగే ఉపాధ్యాయులు వందశాతం ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బొమ్మనహాల్ : మండలంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రులు 879 మంది ఉండగా 663 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 31 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 30 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాగా 9 మంది పసిపిల్లల తల్లులు దాదాపు గంటసేపు క్యూలైన్‌లో నిలబడి ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ విధానాన్ని సెక్టార్ ఆఫీసర్ బి.యల్లప్ప, రూట్ ఆఫీసర్ సర్వే రవితేజ పరిశీలించారు. ఎన్నికలను తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ షకీలా పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓటు వేసి శిరా గుర్తును చూపుతున్న పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

గుత్తిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్

గుంతకల్లులో ఏజెంట్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి

పుట్లూరులో పోలింగ్ కేంద్రం వద్ద టిడిపి కార్యకర్తలతో మాట్లాడుతున్న శ్రావణీశ్రీ

బ్రహ్మసముద్రం : స్థానిక మండల ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల వ్యాప్తంగా 649 మంది పట్టుభద్రుల ఓటర్లు ఉండగా 547 మంది ఓటుహక్కును వినియోగించుకోగా 84.28 శాతం పోలింగ్ నమోదైంది. అదేవిధంగా 17 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 15 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ పరశురాముడు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం ప్రాంతంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని నార్త్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మంత్రి ఉషశ్రీచరణ్, టిడిపి నాయకులు ఉన్నం మారుతి, సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ నాయకులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాగా పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ ఫక్కీరప్ప తనిఖీ చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆర్‌డీఓ నిషాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ శ్రీనివాసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

డి.హీరేహాల్‌లో బారులుతీరిన ఓటర్లు

పెద్దవడుగూరులో..

ఉరవకొండలో ఓటు వేసి బయటకు వస్తున్న ఓటర్లు

In the Court of the Hon'ble Ist Addl. Junior Civil Judge Cum Judicial Magistrate of First Class:Anantapuram
O.S.No.1094/2021
Between:
Smt.B.Puspa Latha W/o Balakrishna C/o D.No.2/216, APHB Colony Nandyala Rural, Kurnool Dist. ...Plaintiff
And
Purewinn Agro PLt and Peoples Grand Mart rep.by its Managing Director M.C.Ravi S/o M.C. Changappa. ...Defendant
NOTICE TO DEFENDANT
Purewinn Agro Plt rep.by its Managing Director M.C.Ravi S/o Changappa, Business "Peoples Grand Mart" under the caption of Pure Organi Products Available D.No.6-2-423-4, NH Bypass Road, Anantapuramu, Native of Gangavaram, Palamanru Mandal, Chittoor Dist.
ఇందుమూలముగా తెలియజేయడమేమనగా ప్రతివాది హాజరు నిమిత్తం పై కోర్టు నందు 12-04-2023 వ తేది వాయిదా ఉన్నది. కావున పై తేదీ రోజు ఉదయం 10.30 గంIIలకు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏవైన ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు నందు తెలుపుకొనవలెను. లేనియెడల కోర్టువారు మీ పరోక్షమందు తీర్మానించెదరు.
(By Order of the Court)
L.PRABHAKAR REDDY, Advocate Anantapuramu.

ఓటు హక్కును వినియోగించుకున్న తోపుదుర్తి నయనతారెడ్డి

ఓటు వేసిన నయనత రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెంకటేశ్వర వెటర్నరీ విశ్వ విద్యాలయం బోర్డు సభ్యురాలు, తోపుదుర్తి మహిళా సహకార డెయిరీ ఛైర్ పర్సన్ తోపుదుర్తి నయనతరెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోమవారం అనంతపురం నగరంలోని విద్యారణ్య ఓరియంటల్ హై స్కూల్ కేంద్రంలో ఆమె తన ఓటుహక్కును వినియోగించుకున్నారు.

రెండు రోజుల పాటు రైల్వే గేట్ మరమ్మతులు

ప్రజాశక్తి-గార్లదిన్నె

గార్లదిన్నె మండల కేంద్రంలోని డ్యామ్ రోడ్ రైల్వే గేట్ వద్ద మంగళవారం నుంచి రెండు రోజుల పాటు మరమ్మతులు చేపట్టనున్నట్లు తహశీల్దార్ ఉషారాణి, గార్లదిన్నె ఎస్ఐ సాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు సహకరించి ప్రత్యామ్నాయ మార్గం ద్వారా వెళ్లాలని కోరారు.

ఓటు వేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

ఓటువేసిన మాజీ ఎమ్మెల్యే విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టభద్రుల ఓటు హక్కును ఉరవకొండ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి వినియోగించు కున్నారు. ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన ఓటు వేశారు. ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. పోలింగ్ సరళిపై అక్కడున్న సిబ్బందితో మాట్లాడారు. ఓటింగ్ సరళిపై అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

నేరాలు ఘోరాలు

ఆర్టీసీ బస్సులో బంగారం చోరీ

ప్రజాశక్తి-నార్పల

ఆర్టీసీ బస్సులో బంగారం చోరీ జరిగిన సంఘటన నార్పల మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం మారుతీనగర్‌కు చెందిన సిఆర్‌పిఎఫ్ జమేదార్ శివశంకర్ భార్య తులసి ఏదో పని నిమిత్తం తన పుట్టిల్లు అయిన నార్పల గ్రామానికి వచ్చింది. పని ముగించుకుని అనంతపురం వెళ్లేందుకు పిల్లలతో కలిసి ఆర్టీసీ బస్సు ఎక్కింది. ఆమె మెడలోని నల్లపూసల దండ, బంగారు ఉంగరాలు, పిల్లల కమ్మలు తీసి ఒక చిన్న పర్సు ఉంచి బ్యాగులో పెట్టుకుంది. అనంతరం టికెట్ తీసుకోవడానికి పర్సు తెరచి చూడగా అందులోని బంగారు వస్తువులు కనిపించలేదు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రాఘవరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి మండలంలోని లచ్చానుపల్లి గ్రామంలో ఓ వ్యక్తి సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన టి.సుంకన్న కుమారుడు తలారి సుధాకర్ (30) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బాధను భరించలేక ఎవరూ లేని సమయంలో ఇంట్లో పైకప్పుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య అనిత, కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పుట్లూరు

మడుగుపల్లి గ్రామం వద్ద ఈ నెల 5వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో దుగుమర్రి గ్రామానికి చెందిన నరసింహుడు (34) తీవ్రంగా గాయపడ్డ విషయం విధితమే. ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

In the Court of the Hon'ble Ist Addl. Junior Civil Judge Cum Judicial Magistrate of First Class:Anantapuram
O.S.No.1036/2021
Between:
Y.Venkata Subbarayudu S/o Yama Tirupathaiah R/o D.No.29-335-B, Saraswathi Nagar, Nandyala Kurnool Dist. ...Plaintiff
And
Purewinn Agro PLt and Peoples Grand Mart rep.by its Managing Director M.C.Ravi S/o M.C. Changappa. ...Defendant
NOTICE TO DEFENDANT
Purewinn Agro PLt rep.by its Managing Director M.C.Ravi S/o Changappa, Business "Peoples Grand Mart" under the caption of Pure Organi Products Available D.No.6-2-423-4, NH, Bypass Road, Anantapuramu, Native of Gangavaram, Palamanru Mandal, Chittoor Dist.
ఇందుమూలముగా తెలియజేయడమేమనగా ప్రతివాది హాజరు నిమిత్తం పై కోర్టు నందు 12-04-2023 వ తేది వాయిదా ఉన్నది. కావున పై తేదీ రోజు ఉదయం 10.30 గంIIలకు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏవైన ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు నందు తెలుపుకొనవలెను. లేనియెడల కోర్టువారు మీ పరోక్షమందు తీర్మానించెదరు.
(By Order of the Court)
L.PRABHAKAR REDDY, Advocate Anantapuramu.

In the Court of the Hon'ble Prl. Junior Civil Judge :Anantapuram
O.S.No.566/2013
Between:
Sake Lakshm idevi ...Plaintiff
And
1.VijauaLakshmi (died) by LRS
2.Shankaraiah 3.D.Nagaraju
4.Smt. D.Bhargavi ...Defendants
NOTICE TO DEFENDANT No.D3 and D4
D3: D.Nagaraju D/o Vijaya Lakshmi, **D4:** D.Bhargavi D/o D.Vijaya Lakshmi. Both are residing at D.No.12-323-1, Gooty Road, Guntakal (Mandal), Anantapuramu District.
ఇందుమూలముగా తెలియజేయడమేమనగా డి3 మరియు డి4 హాజరు నిమిత్తం పై కోర్టు నందు 24-03-2023 వ తేది వాయిదా ఉన్నది. కావున పై తేదీ రోజు ఉదయం 10.30 గంIIలకు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏవైన ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు నందు తెలుపుకొనవలెను. లేనియెడల కోర్టువారు మీ పరోక్షమందు తీర్మానించెదరు.
(By Order of the Court)
L.PRABHAKAR REDDY, Advocate Anantapuramu.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-డి.హీరేహాల్

డి.హీరేహాల్ మండల కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నాటక వాసులైన పై కనుమ మల్లాపురం గ్రామానికి చెందిన కూలీలు పని కోసం శంకరబండ గ్రామానికి వెళ్లారు. కూలి పనులు ముగించుకొని ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. డి.హీరేహాల్ మండల కేంద్రం సమీపంలోని ఓవర్ బ్రిడ్జి పై ముందు వెళుతున్న కూల్ డ్రింక్స్ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో కూలీలు కవిత, అంజనమ్మ, దేవమ్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఎస్ఐ రామకృష్ణారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలు ఢీకొన్న దృశ్యం

గాయపడ్డ వారిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం